## క్లుప్తంగా

### లోక్ అదాలత్‌లో ఇరు వర్గాలు విజేతలే!


జడ్జి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి: లోక అదాలత్‌లో ఇరువర్గాలు విజేతలేనని 12వ జిల్లా అదనపు జడ్జి శ్రీనివాస్‌నాయక్ అన్నారు. గురువారం జడ్జి శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా శనివారం లోక్‌అదాలత్ నిర్వహిస్తామన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, బ్యాంకు శాఖలకు సంబంధించి ప్రీ లిటికేషన్ కేసులు రాజీ చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లోక్‌అదాలత్‌లో సమస్యలు పరిష్కరించుకుంటే అప్పీల్ చేసుకునే అవకాశం కూడా ఉండదని తెలిపారు. సెప్టెంబర్ 13న తేదీ ఉదయం 9 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే లోక్‌అదాలత్ ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు

### ముక్కంటిని దర్శించుకున్న ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొల్లిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి సరయురాయ్, టీటీడీ బోర్డు మెంబర్ నరేష్‌కుమార్ దర్శించుకున్న వారిలో ఉన్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

### కేంద్ర మంత్రికి సాదర స్వాగతం


కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్


రేణిగుంట: మూడు రోజుల తిరుమల, తిరుపతి పర్యటన నిమిత్తం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ఢిల్లీ నుంచి ఎయిర్ ఇండియా విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆమెను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట రెవెన్యూ డివిజనల్ అధికారులు భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, డీఎస్పీ శ్రీనివాసరావు విమానాశ్రయంలో సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆమె తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

### బాల్యవివాహాల నిర్మూలనకు కృషి


ఆలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ప్రతినిధులు

శ్రీకాళహస్తి: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ప్రగతి సంస్థ కో–ఆర్డినేటర్ రాజారెడ్డి అన్నారు. పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద గురువారం ఆలయ సిబ్బంది, పురోహితులు, స్థానికులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌తో కలిసి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ప్రధాన అర్చకులు శశిధర్‌స్వామి, ఆలయ కార్యదర్శి నాగరాజునాయుడు, జగదీష్‌రెడ్డి, రామగుప్తా, శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు భాగ్యలక్ష్మి, మారియమ్మ, సుకన్య, కమ్యూనిటీ సోషల్ వర్కర్స్ చందమామల కోటయ్య, లత, మోహన్‌బాబు పాల్గొన్నారు.

### పురవీధుల్లో విహరించిన అవనాక్షమ్మ


పురవీధుల్లో ఊరేగుతున్న అవనాక్షమ్మ

నారాయణవనం: సముదాయంలోని టీటీడీ అనుబంధ అవనాక్షమ్మ ఆలయ జాతరలో భాగంగా అమ్మవారు బుధవారం రాత్రి నారాయణవనం కోట వీధుల్లో విహరించారు. స్థానిక కోట వీధుల్లోని సెంగుందర్ కులస్తులు మూడు రోజుల పాటు నిర్వహించే అమవారి జాతర బుధవారం నుంచి ప్రారంభమైంది. చిత్రాంగి కోట వీధిలోని వినాయకస్వామి ఆలయంలో బుధవారం సర్వాంగ సుందరంగా అలంకరించిన అమ్మవారి ఉత్సవమూర్తిని పుష్పపల్లకీలో అధిరోహింపజేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అమ్మవారిని దర్శించుకున్నారు.

### సంకట చతుర్థశి పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజి వినాయకస్వామి ఆలయం వద్ద గురువారం ఆగమోక్తంగా సంకట చతుర్థశి పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద అర్చకులు గణపతి హోమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించారు. భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

# దుస్థితిలో రహదారి


సత్యవేడు మార్గంలోని అమాసరెడ్డికండ్రిగ వద్ద గుంతల రోడ్డు


కాళమనాయుడుపేట వద్ద ప్రమాదకరంగా గుంత

- అవస్థలు పడుతున్న వాహనదారులు

వరదయ్యపాళెం: నియోజకవర్గ కేంద్రానికి వెళ్లే సత్యవేడు–కడూరు కూడలి ప్రధాన రోడ్డు అంతటా గుంతలమయమైంది. ఆ మార్గంలో వాహనదారుల రాకపోకలకు అష్టకష్టాలు పడుతున్నారు. నిత్యం ప్రమాదాలకు గురవుతూ వాహనదారుల పరిస్థితి వర్ణనాతీతంగా మారుతోంది. స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్రాంతి కల్లా గుంతలు లేని రోడ్డుగా రూపుదిద్దుతామని, ఎక్కడైనా రోడ్లపైన గుంతలు కనిపిస్తే ఆ బాధ్యత స్థానిక ఎమ్మెల్యేదని బహిరంగ సమావేశాల్లో ఊకదంపుడు ప్రసంగాలు గత ఏడాది చేశారు. అయితే ఆ ప్రసంగాలు మాత్రం క్షేత్ర స్థాయిలో అమలుకు నోచుకోలేదు. రోడ్లపై గుంతలు మాత్రం అలానే మిగిలాయంటూ స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. కనీసం అతుకులు వేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం కొట్టుమిట్టాడుతుండడం గమనార్హం.

**ఛిద్రమైన కల్వర్టులు**

ప్రధానంగా చిన్న పాండూరు నుంచి సత్యవేడు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డులో 15 కల్వర్టులు ఉన్నాయి. కల్వర్టులపై ఉన్న శ్లాబు ధ్వంసమైంది. అంతేకాక కల్వర్టుకు రెండు వైపులా అనుసంధానం రోడ్లు గంతలమయంగా మారడంతో ఆ ప్రాంతంలో వాహనదారులు గుంతల్లో దిగి ఎక్కేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. దీని కారణంగా వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఆ శాఖ అధికారులు పనులు చేపట్టేందుకు నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదికలు అందజేస్తున్నారు. అయినా వారి నుంచి మాత్రం మంజూరుపై స్పందన లేదు.

### ఇంటికే కుల ధ్రువీకరణ పత్రాలు

నాగలాపురం: అర్హులైన వారికి ఇంటికే ఉచితంగా కుల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం తెలిపారు. కుటుంబసభ్యులు సర్వే ఆధారంగా ఈ సర్టిఫికెట్లు పంపిణీ చేస్తామని అన్నారు. రైతుల భూములకు ఆధార్ సీడింగ్ తప్పనిసరిగా చేయాలని సూచించారు. అలాగే అన్నదాత సుఖీభవ మొదటి విడతకు సంబంధించి మృతిచెందిన రైతుల భూములకు సంబంధించిన వారసుల పేర్లకు బదిలీ చేసుకోవాలని తెలిపారు.

### బాల్య వివాహాలు అనర్థదాయకం


మాట్లాడుతున్న యమున

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కొత్తపాళెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న బాలికలకు గురువారం బేటీ బచావో..బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాల అనర్థాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యమున అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యానేరమని హెచ్చరించారు. ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యం, టీచర్లు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి వినతి


పీసీఎండీకి వినతి పత్రం ఇస్తున్న నేతలు

రేణిగుంట: సీఆర్‌ఎస్‌లో గురువారం ప్రిన్స్‌పల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ నిర్మలా రాజారాం పర్యటించారు. ఈసందర్భంగా సీఆర్‌ఎస్ మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ నేతలు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం రైల్వే హాస్పిటల్‌లో ఉన్న సమస్యలపై వినతి పత్రం అందించారు. సదాశివ రెడ్డి మాట్లాడుతూ రైల్వే హాస్పిటల్‌లో స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించాలని, అదేవిధంగా ల్యాబ్ పరికరాలను, క్యాంటీన్ ఏర్పాటు చేయాలని పీసీఎండీని కోరినట్లు, పరిష్కరిస్తామని పీసీఎండీ హామీ ఇచ్చారని తెలిపారు. సీఎంఎస్ వేణుగోపాల్ రెడ్డి, చీఫ్ వర్క్ షాప్ మేనేజర్ దేవ సహాయం, ట్రెజరర్ మునికుమార్, ఆఫీస్ బేరర్స్ హెంద్రీ పాల్, ముని రాధయ్య, చంద్రనాయక్ పాల్గొన్నారు.

### మెగా వైద్యశిబిరం విజయవంతం


పాపానాయుడు పేటలో వైద్యశిబిరం

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట రాస్ మహిళా భారతి ఆధ్వర్యంలో గురువారం అరవింద కంటి ఆస్పత్రి, డీఎస్‌ఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతమైంది. శిబిరంలో 240 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ సతీష్, డాక్టర్ జెనీఫర్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ డీఎస్‌ఆర్. రెడ్డి, అన్నాదురై, వేదాచలం, మునీంద్ర, సి.మునిపార్థసారథి, జయంతి, భువనేశ్వరి, సుమలత, గాయత్రి, ఉషారాణి, ప్రసన్న, ఉష, ఎస్ జీవన్‌రావు పాల్గొన్నారు.

# పనులను అడ్డుకున్న అటవీశాఖ


కైలాసనాథ కోనలో పనులను అడ్డుకుంటున్న ఫారెస్ట్ సిబ్బంది

నారాయణవనం: మండలంలోని కై లాసనాథకోనలో దేవదాయశాఖ చేపడుతున్న అభివృద్ధి పనులను గురువారం చిత్తూరు జిల్లా అటవీశాఖ అధికారులు, సిబ్బంది అడ్డుకున్నారు. దేవదాయ శాఖ స్థలంలో చేపడుతున్న పనులను అటవీశాఖ సిబ్బంది దౌర్జన్యంగా పనులను అడ్డుకోవడంపై భక్తులు, స్థానికులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కొత్త జిల్లాలు ఏర్పాటుతో నారాయణవనం మండలంలోని అటవీ ప్రాంతం చిత్తూరు జిల్లా అటవీశాఖ పరిధిలోకి వెళ్లింది. దీంతో చిన్న పనులను చేపట్టినా చిత్తూరు జిల్లా అటవీశాఖ అధికారుల ఆగడాలకు, దౌర్జన్యాలకు అంతులేకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు. కై లాసనాథకోన జలపాతాన్ని, కామాక్షాంబిక సమేత కై లాసనాథుని ఆలయాన్ని సందర్శించే పర్యాటకులు, భక్తుల సౌకర్యాల కోసం టాయిలెట్లు, రూములను దేవదాయశాఖ తమ ఆధీనంలోని స్థలంలో నిర్మిస్తున్నారు. అయితే ఎలాంటి నిర్మాణ పనులను చేపట్టకూడదంటూ చిత్తూరు జిల్లా అటవీశాఖ సిబ్బంది పనులను ఆపివేయించి కార్మికులను పంపించేశారు. దేవదాయశాఖ, స్థానికులు వారించినా అటవీశాఖ సిబ్బంది తగ్గకపోగా పనులను ఆపివేశారు. దీంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# గురుకుల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్ర స్థాయి నాల్గవ ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలల క్రీడా పోటీల్లో కనమనంబేడు ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ ధర్మేంద్రసింగ్ తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 2 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి నాల్గవ ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలల క్రీడా పోటీలు జరిగాయన్నారు. ఈ క్రీడా పోటీల్లో అండర్–19, 14 విభాగాల్లో విద్యార్థులు పాల్గొన్నారు. 11 బంగారు, 3 వెండి, మూడు 3 కాంస్య పతకాలను తమ పాఠశాల విద్యార్థులు సాధించారని తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను గురువారం ప్రిన్సిపల్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

### సీఆర్పీలకు శిక్షణ


మాట్లాడుతున్న అధికారులు

రేణిగుంట: శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ పరిధిలో నూతనంగా నియమతులైన సీఆర్పీలకు రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీలో గురువారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీఆర్పీల విధి విధానాలపై డీపీఆర్‌సీ షణ్ముగం, కిషోర్‌కుమార్ శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రభురావు, సర్పంచ్ ఈశ్వరమ్మ, కార్యదర్శి ఎంజీ రమేష్ పాల్గొన్నారు.

### శ్మశాన దారిలో ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

రేణిగుంట: మండలంలోని జి.పాళ్యం పంచాయతీ కృష్ణయ్య కాలనీలోని శ్మశాన వాటికకు కొంతకాలంగా పక్కన రైతులు ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేసుకున్నారు. గురువారం గ్రామంలోని వ్యక్తి మృతిచెందారు. దహన క్రియలు నిర్వహించేందుకు శ్మశానానికి వెళ్లేందుకు దారి లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు. వైఎస్సార్‌సీపీ నేతలు గంగయ్య, శ్రీనివాసులు విషయాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన తహసీల్దార్, ఆర్‌ఐ జయకృష్ణ, సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. గ్రామస్తులతో చర్చించి శ్మశాన దారిలో వేసిన ఫెన్సింగ్‌ను జేసీబీలతో తొలగించారు. వైఎస్సార్‌సీపీ నేతలకు, తహసీల్దార్‌కు గ్రామస్తుల కృతజ్ఞతలు తెలిపారు. వీఆర్వో నళిని, కార్యదర్శి సుబ్బారెడ్డి, నేతలు గుణశేఖర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

### డ్రైవింగ్ స్కూల్‌ను వినియోగించుకోండి

తిరుపతి అర్బన్: నాలుగేళ్ల క్రితం తిరుపతి అలిపిరి ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన డ్రైవింగ్ స్కూల్‌ను అంతా సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్, డీఎం హరిబాబు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ స్కూల్‌లో ఇప్పటి వరకు 34 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేశామని వెల్లడించారు. ఆర్టీసీ ఏర్పాటు చేసిన డ్రైవింగ్ స్కూల్‌లో నామమాత్రపు ఫీజులు చెల్లించి హెవీ డ్రైవింగ్ లెసెన్స్ పొందడానికి వీలుందని ఆయన వివరించారు. అనంతరం ఈనెల 14వ తేదీ సోమవారం నుంచి కొత్త బ్యాచ్‌కి దరఖాస్తులు అందిస్తామని తెలియజేశారు. లైసెన్స్ రెన్యూవల్ చేసుకునేవారు రూ.1,180 చెల్లించాలని స్పష్టం చేశారు.

### అడ్మిషన్లు ఆపేయడం దారుణం

తిరుపతి సిటీ: ఏపీలోని అంబేడ్కర్ అధ్యయన కేంద్రాలలో 2024–25, 2025–26 విద్యా సంవత్సరాలకు సంబంధించి యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం దారుణమని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలోని అంబేడ్కర్ అధ్యయన కేంద్రం నుంచి భారీ ర్యాలీ నిర్వహించి, ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎంతో మంది గ్రామీణ పేద విద్యార్థులకు, చిరు ఉద్యోగులకు ఆసరాగా ఉన్న ఉన్నత విద్యను దూరం చేయడం దారుణమని మండిపడ్డారు.

### పీహెచ్‌సీలో సిబ్బంది కొరత


మాట్లాడుతున్న తహసీల్దార్

నాగలాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సింధూ ఆధ్వర్యంలో గురువారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు గత మూడు నెలల్లో జరిగిన ప్రగతి నివేదికను చదివి వినిపించారు. తహసీల్దార్ హనుమాన్‌నాయక్ మాట్లాడుతూ రేషన్ కార్డు లేని వారు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఏఓ మాట్లాడుతూ రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు యూరియా త్వరలోనే రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం పీహెచ్‌సీలో సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వైస్ ఎంపీపీ కుమారి, జాయిస్ దానివేలు, ఎంపీడీఓ బాలాజి నాయక్, తహసీల్దార్ హనుమాన్‌నాయక్, ఏఓ చిట్టిబాబు, ఏఈ పృథ్వి, అంగన్ వాడీ సూపర్ వైజర్ శ్రీదేవి పాల్గొన్నారు.

# సామాజిక సేవలతో మిథున్ పుట్టినరోజు


బుచ్చినాయుడుకండ్రిగలో కేక్ కట్ చేస్తున్న రాజేష్, నేతలు


నాగలాపురంలో కేక్ కట్ చేస్తున్న నేతలు


బుచ్చినాయుడుకండ్రిగలో అన్నదానం చేస్తున్న రాజేష్, నేతలు


సత్యవేడులో అన్నదానం చేస్తున్న నేతలు

సత్యవేడు: వైఎస్సార్‌సీపీ నేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆయన అభిమానులు, పార్టీ శ్రేణులు గురువారం మండల కేంద్రంలో మండల కన్వీనర్ కే.సునీల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. 250 మందికి అన్నదానం చేశారు.

కేవీబీపురం: కేవీబీపురంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి, కేక్ కట్ చేసి, స్వీట్లు పంచి పెట్టారు.

**ఓటమి ఎరుగని ధీరుడు మిథున్‌రెడ్డి**

బుచ్చినాయుడుకండ్రిగ: చిన్న వయస్సులోనే రాజకీయాల్లోకి అశేష ప్రజాదరణతో ఓటమి ఎరుగని నాయకుడిగా మిథున్‌రెడ్డి చరిత్ర సృష్టించారని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తెలిపారు. గురువారం బుచ్చినాయుడుకండ్రిగలో మండల కన్వీనర్ కొణతనేని మణినాయుడు ఆధ్వర్యంలో జరిగిన మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా పలు సేవా కార్యక్రమాలను పార్టీశ్రేణులు నిర్వహించి అభిమానాన్ని చాటుకున్నారు.

**నాగలాపురంలో..**

నాగలాపురం: పార్టీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

**నారాయణవనంలో..**

నారాయణవనం: స్థానిక పార్టీ నేతలు, కార్యకర్తలు మిథున్‌రెడ్డి పేరున నారాయణవనం బైపాస్ సమీపంలోని వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

**వరదయ్యపాళెంలో..**

వరదయ్యపాళెం: మండల కేంద్రంలో ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్థానికులకు పంచిపెట్టారు.


వరదయ్యపాళెంలో కేక్ కట్ చేస్తున్న నేతలు


కేక్ కట్ చేస్తున్న పార్టీ శ్రేణులు


కేవీబీపురంలో సంబరాలు

### సేవ చేసిన అధికారులపై చర్యలా ?


నిరసన తెలుపుతున్న గుత్తివారిపల్లి గ్రామస్తులు

రేణిగుంట: ప్రాణాపాయ పరిస్థితుల్లో రాత్రీపగలు లేకుండా గ్రామంలో ఉండి సేవచేసి మా ప్రాణాలు కాపాడిన అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం దారుణమని గుత్తివారిపల్లి గ్రామస్తులు వాపోయారు. రేణిగుంట మండలం గుత్తివారిపల్లిలో గత వారం డయేరియా వ్యాప్తి చెందిన ఘటనలో జిల్లా అధికారులు మండల స్థాయి అధికారులపై చర్యలకు ఆదేశించారు. గురువారం గ్రామంలోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ఎదురుగా ఉన్నతాధికారుల తీరును నిరసిస్తూ గ్రామస్తులు నిరసన తెలిపారు. సర్పంచ్ మంజుల మాట్లాడుతూ సేవ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. ఉన్నతాధికారులు పునరాలోచన చేయాలని కోరారు. ఉప సర్పంచ్ శ్రీహరి మాట్లాడుతూ ఎన్నడూ లేనివిధంగా అనుకోని విపత్తు గ్రామంలో ఎదురైందని, ఆ నిమిషం నుంచి అన్ని శాఖల అధికారులు గ్రామంలోనే ఉండి అందరి ఆరోగ్యం మెరుగుపడే వరకు చర్యలు తీసుకున్నారని తెలిపారు.